క్లుప్తంగా

కొనసాగుతున్న స్వాములకు సద్ది వితరణ



వెల్లటూరు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామ దేవతలైన మూలపుటమ్మ శ్రీ ముత్యాలమ్మ, శ్రీ కట్లమ్మ, శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవస్థానంలోని ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి పీఠం వద్ద శనివారం 14వ రోజు సద్ది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని శ్రీ అయ్యప్ప స్వామి భక్త బృందం శ్రీ కట్లమ్మ తల్లి దేవస్థాన అభివృద్ధి కమిటీ పర్యవేక్షించింది.ఈ కార్యక్రమం నవంబర్ 15వ తేదీ వరకు కొనసాగుతుందని దాతలు మోహన శ్రీనివాస రావు (పాల శ్రీను) గురుస్వామి, మరక శ్రీనివాసరావు (ల్యాబ్ శ్రీను) పేర్కొన్నారు. దేవస్థానం అర్చకుడు క్రోవి రామకృష్ణ పూజా కార్యక్రమాలు పర్యవేక్షించారు.

ధన్వంతరి జయంతి వేడుకలు



వెల్లటూరు(భట్టిప్రోలు): సమరసత సేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో శనివారం భట్టిప్రోలు మండలం వెల్లటూరులో ధన్వంతరి జయంతి పురస్కరించుకుని ఆర్ఎంపీ మామిడి వెంకట రవి బాబు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి వేడుకలు జరిపారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు మాట్లాడుతూ ఆశ్వయుజ బహుళ త్రయోదశిని ధన్వంతరి జయంతిగా జరుపుకొంటారని, ఆయుర్వేద వైద్యానికి మూల పురుషుడు ధన్వంతరి అని తెలిపారు. ఎస్ఎస్ఎఫ్ సబ్‌డివిజన్ కన్వీనర్ క్రాప రవి కుమార్, గ్రామ కన్వీనర్ ఆరేపల్లి సుధాకర్, నిర్వాహకులు సాయిరామ్, ఫణి రాజు, బధు, మల్లి, వెంకట్రావు, కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దారుణం

కొల్లూరు: కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు యత్నించడం దారుణమైన విషయమని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుగ్గున మల్లేశ్వరరావు అన్నారు. శనివారం మండలంలోని ఈపూరు, జువ్వలపాలెం గ్రామాలలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడం ద్వారా తన అనుయాయులుకు ఆర్థికంగా మేలు చేయడానికి యత్నిస్తున్నారన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను ప్రభుత్వం ద్వారా అందించాల్సింది పోయి ప్రైవేటుకు అప్పగించడం దారుణమన్నారు. వైఎస్సార్ సీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణలో భాగంగా ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. సర్పంచి వసుందర, నాయకులు వెంకటస్వామి, సుబ్బారావు, పిల్లి బుజ్జి, కనకయ్య, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ సిగ్గుచేటు..

వేమూరు: కూటమి ప్రభుత్వం మెడికల్ కళాశాలను ప్రైవేటీకరణకు పాల్పడడం సిగ్గుచేటని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దాది సుబ్బారావు తెలిపారు. వెల్లబాడులో శనివారం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. మండల పరిశీలకులు చిలుమూరు రామోహనరావు మాట్లాడుతూ పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉచిత మెడికిల్ సీట్లు సాధించాలంటే ప్రభుత్వ మెడికల్ కళాశాలలు అవసరమని మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలలకు అనుమతి తీసుకొని వచ్చి, పనులు ప్రారంభించడం జరిగిందన్నారు. కొన్ని కళాశాలలు ప్రారంభించారని, మరికొన్ని ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన చెప్పారు. ఈ దశలో కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణకు పూనుకోవడం దారుణమన్నారు. ఎంపీపీ యల్లమాటి మోహనరావు, గ్రామ సర్పంచ్ వెల్లబాడు బుల్లియ్య, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిజాంపట్నం బీచ్ పరిశీలన



నిజాంపట్నం: పవిత్ర కార్తికమాసం పురస్కరించుకుని నిజాంపట్నం బీచ్‌లో పుణ్యస్నానాలు ఆచరించేందుకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారనిని నిజాంపట్నం ఎస్ఐ తిరుపతిరావు అన్నారు. నిజాంపట్నం బీచ్‌ను శనివారం ఆయన సందర్శించి, సౌకర్యాలు పరిశీలించారు. బీచ్ వద్ద తమ నిఘా నిరంతరం ఉంచటం జరుగుతుందని, శాంతి భద్రతలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తీరంలో డ్రోన్ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా, మద్యం తాగి ఎవరైనా బీచ్‌కు వచ్చిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీచ్ సమీపంలోని జెట్టిని నిషేధించటం జరిగిందని, ఇటువైపు రాకపోకలు నిషేధించామని చెప్పారు. అనంతరం బీచ్ వద్ద నిర్వహించాల్సిన విధి విధానాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు.

నట్టేట ముంచడం బాబుకు అలవాటే

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయం ఉపసంహరించుకోవాలి
- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్



రచ్చబండ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతున్న డాక్టర్ ఈవూరు గణేష్

నగరం: కల్లబొల్లి మాటలు చెప్పటం, నయవంచన చేయటం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడుకు అలవాటేనని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు మండలంలోని పెదపల్లిలో గ్రామంలో నిర్వహిస్తున్న కోటిసంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు దొంగ హామీలను ఇచ్చి నేడు నట్టేటా ముంచుతున్నారన్నారు. విద్యా వ్యవస్థ బాగుంటేనే సమజం బాగుంటుందన్న ఉద్దేశంతో నాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాడు-నేడుతో విద్యావ్యవస్థను అభివృద్ధి చేశారన్నారు. వైద్య విద్యను పేద, ప్రతిభావంతులైన విద్యార్థుల చెంతకు చేర్చి రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేశారన్నారు. నేడు కార్పొరేట్ వ్యవస్థను అభివృద్ధి చేసే దిశగా చంద్రబాబు ఆలోచనా విధానం ఉందని, మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేసేందుకు నిర్ణయాలు తీసుకుంటున్నాడని, ఈ విధానంతో వైద్యం పేదలకు భారమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీ సరిగా అమలు లేక, అటు వైద్య కళాశాలల ప్రైవేటీకరణతో సరైన వైద్యం అందక ప్రజలు ఇబ్బందులకు గురవుతారన్నారు. ఈ విధానాన్ని ఉపసంహరించుకోకుంటే ప్రజలు బుద్ధిచెబుతారని సూచించారు. ఈసందర్భంగా మెడికల్ కళాశాలలకు వ్యతిరేకంగా ప్రజల నుంచి సంతకాలను సేకరించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలక న్వీనర్ ఇంకొల్లు రామకృష్ణ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ యార్లగడ్డ మదన్‌మోహన్, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు డి.కొండలురెడ్డి, రైతువిభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కొండెపు శ్రీనివాసరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి లుక్కా బాపనయ్య, ఆర్గనైజింగ్ జిల్లా కార్యదర్శి నిజాంపట్నం కోటేశ్వరరావు, రాష్ట్రజాయింట్ సెక్రటరీ చిమటా బాలాజీ, జిల్లా అధికార ప్రతినిధి కర్రి వెంకట కృష్ణారెడ్డి, ప్రచార విభాగం కార్యదర్శి శొంఠి సురేష్, నాయకులు ఏసుపాదం, రాము, గోపి, సాయిరాము, ఆంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

అండర్-14,17 వాలీబాల్ పోటీల్లో సత్తా



వాలీబాల్ పోటీలలో రన్నర్స్‌గా నిలిచిన బాలికల టీమ్

భట్టిప్రోలు: కర్లపాలెం మండలం యాజలి జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన బాపట్ల జిల్లా స్థాయి అండర్-14,17 వాలీబాల్ పోటీలలో అండర్-14 విభాగంలో భట్టిప్రోలు టీఎంరావ్ హైస్కూల్ వాలీబాల్ బాలికల టీం రన్నర్స్‌గా నిలిచింది. ఈ టీమ్‌లో షేక్ జుబేదా, షేక్ కలీమా, కారంపూడి మమత, షేక్ యాసీనా, కనపరాజు సోనాక్షి, సయ్యద్ మునీరా ఉన్నారు. అండర్-14 ఉమ్మడి గుంటూరు జిల్లా టీమ్‌కు నక్కా మౌనిక, అండర్-17 జట్టుకు పఠాన్ రహమత ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి పురుషోత్తం విజేతలకు మెడళ్లు అందజేసి, అభినందించారు. పోటీలకు శిక్షణ ఇచ్చిన హైస్కూల్ పీఈటీ చేబ్రోలు శ్రీనివాసరావును శాలువాతో సత్కరించారు. శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను, పీఈటీని అభినందించారు. ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రటరీ షేక్ కరిముల్లా, ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, పీఈటీ ఎండీ అనూల్ హక్, ఎస్‌జీఎఫ్ కె.బుజ్జి, కరస్పాండెంట్ పి.మల్లిఖార్జునరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ అత్తోట సుగుణ కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూర్యలంకను షూటింగ్ స్పాట్ చేయండి

బాపట్ల: పర్యాటక కేంద్రమైన సూర్యలంక బీచ్‌లో సినిమా షూటింగ్‌లకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించవలసిందిగా బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను సినీ దర్శకుడు,' 'మా - ఏపీ' వ్యవస్థాపకులు దిలీప్ రాజా కోరారు. ఈ మేరకు ఆయన శనివారం బాపట్ల జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆంధ్రరాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధిలో సూర్యలంక బీచ్ భాగం కాగలదనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. నటీనటులకు, సాంకేతిక నిపుణులకు షూటింగ్ సమయంలో వసతి, షూటింగ్‌ల కోసం మండువా లోగిలి ఇల్లు, పోలీస్‌స్టేషన్ కనీస అవసరాలని దిలీప్ రాజా తెలిపారు. ఇందుకోసం రాయితీతో నిర్మాతలు అద్దె చెల్లిస్తారన్నారు. సముద్రం దగ్గర హీరో హీరోయిన్ల మాంటేజెస్, బోటింగ్, ఛేజింగ్ సన్నివేశాలను చిత్రీకరణకు సూర్యలంక బీచ్ అందమైన లోకేషన్ అవుతుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌ను కలిసిన బృందంలో నిర్మాత పూసపాటి పవన్ కుమార్, నటుడు మిలటరీ ప్రసాద్ ఉన్నారు.

కుర్రా నాగగణేష్ కుటుంబానికి పరామర్శ



కుర్రా నాగ గణేష్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న వరికూటి అశోక్‌బాబు

అమర్తలూరు(వేమూరు): కుర్రా నాగ గణేష్ తల్లిదండ్రులను ఆదుకుంటామని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు తెలిపారు. ఇటీవల హత్యకు గురైన అమర్తలూరు మండలం యడవూరు గ్రామానికి చెందిన కుర్రా నాగ గణేష్ గృహానికి శనివారం వెళ్లిన అశోక్‌బాబు మృతుడి తల్లిదండ్రులను పరామర్శించారు. అనంతరం కుర్రా నాగ గణేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 7వ తేదీన బుడంపాడు వద్ద కుర్రా నాగ గణేష్‌ను హత్య చేశారన్నారు. హత్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు ఎం.వెంకట్రావు, రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి పెరికల పద్మారావు, యువజన విభాగం సంయుక్త కార్యదర్శి జల్లి జోషికాంత్, వేమూరు నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు కరేటి శివనాగ రాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎవరికి వారే.. యమునాతీరే!

- తెనాలిలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు
- చేతివాటం ప్రదర్శిస్తున్న ఓ అధికారి
- కౌన్సిలర్ ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన అవినీతి
- విచారణ జరుపుతున్న మున్సిపల్ అధికారులు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో యథేచ్ఛగా అక్రమ కట్టడాలు కొనసాగుతున్నాయి. వీటిని అనుమతించవద్దని మంత్రి మనోహర్ పదేపదే చెబుతున్నా అధికారుల్లో మాత్రం మార్పు రావటం లేదు. టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసే ఓ అధికారి ఓ భవన యజమాని దగ్గర రూ.90 వేలు లంచం తీసుకున్నట్లు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఫిర్యాదు చేయటంతో మున్సిపల్ కార్యాలయంలో కలకలం రేగింది. వివరాలలోకి వెళ్తే... బాలాజీరావు పేటలో 100 చదరపు గజాలలో ఎటువంటి మున్సిపల్ అనుమతులు లేకుండా ఓ భవనాన్ని నిర్మిస్తున్నాడు. విషయం తెలుసుకున్న టౌన్ ప్లానింగ్ అధికారి అక్కడి వెళ్లి నిర్మాణ పనులు ఆపకుండా చేతివాటం ప్రదర్శించినట్లు ఆ ప్రాంత వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ దృష్టికి వచ్చింది. వెంటనే ఆయన విషయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, ఎసీపీల దృష్టికి తెచ్చాడు. అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తుంటే ఎందుకు అడ్డుకోవటం లేదని అధికారులను ప్రశ్నించాడు. త్వరలో జరిగే కౌన్సిల్ సమావేశంలో వీటిపై చర్చించనున్నట్లు ప్రకటించాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు దీనిపై విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. తెనాలిలో ఎటువంటి అనధికార కట్టడాలను అనుమతించవద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మున్సిపల్ అధికారులతో జరిగిన సమీక్షలో హెచ్చరించాడు. అది జరిగిన మరుసటి రోజే ఆరోపణ రావటంతో మున్సిపల్ కార్యాలయంలో చర్చనీయాంశంగా మారింది.

సాహితీ లోకంలో ధ్రువతార విశ్వనాథ సత్యనారాయణ



నివాళి అర్పించిన పూర్వవిద్యార్థి బృందం

తెనాలి: కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ సాహితీలోకంలో ధృవతారగా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రచారకర్త సంస్కృత, ఆంధ్ర భాషాధ్యాపకులు శ్రీమాన్ కూర్మనాథ్ ఆచార్యులు అన్నారు. స్థానిక చినరావూరులో కేఎల్ఎన్ సంస్కృత కాలేజీ పూర్వ విద్యార్థి బృందం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం విశ్వనాథ సత్యనారాయణ వర్ధంతిని నిర్వహించారు. వినాయకరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి కూర్మనాథ్ మాట్లాడుతూ రామాయణ కల్పవృక్షం, వేయిపడగలు, కిన్నెరసాని పాటలు, శతకాలు, గేయాలు...సహా వేలాదిగా రచనలు చేసి ఇతిహాసాలు సామాజిక సాంఘిక పరమైన విషయాలను సమాజానికి అందించిన మహావ్యక్తి విశ్వనాథ అన్నారు. పలుచని వాడుకతో కలిగిన చందస్సును తెలుగు తల్లికి ముక్కెరగా చేసినటు కవి విశ్వనాథ అన్నారు. కవిసామ్రాట్‌గా కీర్తిని గడించిన సత్యనారాయణ రచనలు తెలుగు భాష బ్రతికి ఉన్నంతవరకు చిరస్థాయిగా ఉంటాయన్నారు. తెలుగు భాషా పండితుడు దేవయజనం మురళీకృష్ణ, రామలింగేశ్వరరావు, ఈఎల్‌వీ అప్పారావు, కృష్ణకుమారి, సద్యోజాతం లక్ష్మణరావు, ఫల్గుణ కుమార్, సత్యనారాయణ, అరుణకుమారి, మేడూరి శ్రీనివాసమూర్తి, సూర్యప్రభ, సుశీల, వర్ధని, సామ్రాజ్యలక్ష్మి తదితరులు విశ్వనాథ సాహిత్యంపై ప్రసంగించారు తొలుత ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

విద్యార్థులకు స్వచ్ఛమైన నీటిని అందించాలి

రేపల్లె: వసతి గృహాలలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎం.సూర్యప్రకాష్ అన్నారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో స్వచ్ఛమైన తాగునీరు లేక పోవటంతోనే అనేక మంది విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. రేపల్లె పట్టణంలో అధిక సంఖ్యలో విద్యార్థులు ఉన్న వసతి గృహాలలో తాగునీటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్లు ఉంటే మరమ్మతులకు గురవ్వకుండా నిరంతరం పర్యవేక్షిస్తుండాలని సూచించారు. సెలవు రోజుల్లో సైతం విద్యాసంస్థలను పెట్టి విద్యార్థులను మానసికంగా వేధిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఎస్ఎఫ్ఐ గార్ల్స్ కన్వీనర్ హేమనాగశ్రీ, ఎస్ఎఫ్ఐ నాయకులు మణిలాల్, నాగరాజు, జాన్సన్‌బాబు, ఆనంద్, కళ్యాణ్, శరత్, పవన్, సంజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ వేడుకలు



కొల్లూరు: గ్యార్మీ పర్వదినోత్సవం కొల్లూరులో అత్యంత ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి స్థానిక జెండా చెట్టు వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన అనంతరం విద్యుత్తు దీపాల అలంకరణతో సుందరంగా తీర్చిదిద్దిన జెండాను గ్రామ ప్రధాన వీధులలో ఊరేగింపుగా తరలించారు. జెండా పండుగను పునస్కరించుకొని ఆదివారం జెండా చెట్టు వద్ద అన్నదానం నిర్వహించనున్నారు. పండుగ వేడుకలలో మత సామరస్యానికి ప్రతీకగా హిందువులు సైతం పాల్గొని ముస్లింలతో పాటు మొక్కులు చెల్లించుకున్నారు.

నసీమా చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

డీఎల్‌పీఓ స్వరూపరాణి



తెనాలిటౌన్: నసీమా చారిటబుల్ ట్రస్ట్ సేవలు అభినందనీయమని డీఎల్‌పీవో స్వరూపరాణి పేర్కొన్నారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ నిర్వహించారు. నసీమా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు కె.రమేష్‌బాబు సతీమణి నసీమా 8వ వర్ధంతి సందర్భంగా ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీఎల్‌పీవో స్వరూపరాణి, డిప్యూటీ ఎంపీడీవో వైవీడీ ప్రసాద్ పాల్గొని కార్మికులకు నూతన వస్త్రాలు అందజేశారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. కార్యక్రమంలో హరీష్‌నాయుడు, బి.చంద్రమోహన్, డి.శ్రీనివాసరావు, ఎస్.సాయి, ఎం.వీరరాఘవయ్య, ఎ.వెంకటసత్యనారాయణ, ఎ.శివనాగేశ్వరరావు, జి.వెంకటేశ్వరరావు, తోట నరేంద్ర ఉన్నారు.

బావిలో జారిపడి వ్యక్తి మృతి

మంగళగిరి టౌన్: బావిలో జారిపడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళగిరి మండలంలో శుక్రవారం చోటుచేసుకుంది. మంగళగిరి మండలం కురగల్లు గ్రామానికి చెందిన కట్టెపోగు సురేంద్ర (32) నీరుకొండలో వీఆర్‌ఏ. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రెండేళ్ల క్రితం సురేంద్ర తండ్రి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ ఉద్యోగాన్ని అతనికి కేటాయించారు. ఉద్యోగం రాకముందు కొంత పొలం కౌలుకు తీసుకుని అప్పుల పాలైనట్లు సురేంద్ర భార్య అరుణ తెలిపారు. ఆర్థికఇబ్బందులు, తల్లిదండ్రులు చనిపోవడంతో మానసిక క్షోభకు గురై బాధపడుతూ ఉండేవాడని ఆమె తెలిపింది. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఇంట్లో నుంచి డ్యూటీకి వెళ్లాడని తెలిపారు. బంధువులు నీ భర్త సురేంద్ర సమీపంలోని మల్లెతోటలో ఉన్న బావిలో పడి చనిపోయినట్లు తెలిపాడని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా అప్పుల బాధతో చనిపోయేంత పిరికివాడు కాదని, గతంలో ఒక ప్లాట్ అమ్మి కొన్ని అప్పులు తీర్చాడని, కేవలం మనశ్శాంతి కోసమే ఆ బావి దగ్గర కూర్చోవడానికి వెళ్తుంటాడని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు బావిలోపడి ఉండొచ్చని తన భర్తకు ఈత రాదని ఫిర్యాదులో పేర్కొంది. ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీసులు అండర్ సెక్షన్ 194 బీఎన్ఎస్ఎస్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'స్వచ్ఛ రేపల్లె'లో భాగస్వాములు కావాలి

ఆర్డీఓ రామలక్ష్మి



రేపల్లె ఓల్డ్‌టౌన్‌లో స్థానికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ రామలక్ష్మి



చుండూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

రేపల్లె: స్వచ్ఛ రేపల్లె సాధనతో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆర్డీఓ రామలక్ష్మి కోరారు. స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఓల్డ్‌టౌన్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీఓ పాల్గొని మాట్లాడారు. తమ గృహాలతో పాటు పరిసరాలు సైతం పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలన్నారు. గృహాల నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలు పారిశుద్ధ్య సిబ్బందికిగాని, నిర్ణీత ప్రదేశాలలో మాత్రమే పడవేయాలన్నారు. పరిశుభ్రమైన ప్రదేశాలే ఆరోగ్యవంతమైన సమాజానికి పునాదని సూచించారు. పచ్చని వాతావరణంలో, ఆరోగ్యవంతమైన వాతావరణం నెలకొనాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పెంచాలని చెప్పారు. అప్పుడే వాతావరణ సమతౌల్యం ఏర్పడతుందన్నారు. ఈ సందర్భంగా స్వచ్ఛ రేపల్లె సాధనకై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు, టీడీపీ నాయకులు అనగాని శివప్రసాద్, మేకా రామకృష్ణ, ప్రజాసంఘాల నాయకులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో..

స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రి కళాశాల ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ వలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్స్‌లు సైకిల్ ర్యాలీ, వాక్‌తాన్ నిర్వహించారు. స్వచ్ఛపరిసరాల సాధనపై పురప్రజల్లో నినాదాలు చేస్తూ చైతన్యం కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవిచంద్రకుమార్, స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కో-ఆర్డినేటర్ ఎం.దాసు, సభ్యులు బుజ్జిబాబు, బాలగురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

చుండూరులో...

చుండూరు(వేమూరు): స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర ద్వారా గ్రామాలు పరిశుభ్రం చేసుకోవాలని ఎంపీడీఓ సుదీప పేర్కొన్నారు. చుండూరు మండల కేంద్రంలోని స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ర్యాలీ శనివారం నిర్వహించారు. మండల పరిషత్ పరిపాలన అధికారి ఉషారాణి, పారిశుద్ధ్య కార్మికులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెరవలిలో...

వేమూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అమర్తలూరు సీడీపీఓ లక్ష్మీదేవి పేర్కొన్నారు. వేమూరు మండలం పెరవలి గ్రామంలోని నాల్గో అంగన్‌వాడీ కేంద్రంలో స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో చెట్లు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అమృతవాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

భట్టిప్రోలు మండలంలో 'రచ్చబండ'



భట్టిప్రోలు మండలం కోనేటిపురంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో శనివారం భట్టిప్రోలు మండలం కోనేటిపురంలో రచ్చబండ కార్యక్రమం జరిగింది. కోటి సంతకాల నిర్వహణ పరిశీలకులు రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ జల్లి జోషికాంత్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), గ్రామ పార్టీ కన్వీనర్ పడమట కుమార స్వామి, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని ఓలేరు పంచాయతీ పరిధిలోని వెంకట్రాజునగర్‌లో పార్టీ పరిశీలకులు ఎస్.జస్వంత్‌రాజ్ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పి. శ్రీనివాసరావు, గ్రామ పార్టీ కన్వీనర్ కె. వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జె.దాసు, వివిధ విభాగాల నాయకులు ఎన్. గోపాలం, ఎన్. సురేష్, ఎం. జగదీష్, జి. దానియేలు, ఆర్.కిషోర్, బంగారు రాజు, ఎన్. రవికుమార్, డి. వరుణ్, తదితరులు పాల్గొన్నారు. సూరేపల్లి పంచాయతీ పరిధిలోని వేమవరం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో పరిశీలకులు పసుపులేటి శివరామ ప్రసాద్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు జంగం వాసు, సీనియర్ నాయకుడు సయ్యద్ యూసఫ్, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలీసు అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం

జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్



హెడ్ కానిస్టేబుల్ పి.వెంకటస్వామి సతీమణి హేమలతకు చెక్కు అందిస్తున్న ఎస్పీ

బాపట్ల: పోలీస్ సిబ్బంది కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ భరోసా కల్పించారు. వారి సమస్యల పరిష్కారానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఇటీవల గుండెపోటుతో మరణించిన హెడ్ కానిస్టేబుల్ పి.వెంకట స్వామి సతీమణి హేమలతకు బాపట్ల జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం జిల్లా ఎస్పీ రూ.లక్ష అడిషనల్ కార్పస్ ఫండ్ చెక్‌ను అందజేశారు. బాపట్ల జిల్లా జె.పంగులూరు పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే హెచ్.సి 3939 పి.వెంకట స్వామి ఇటీవల గుండెపోటుతో మరణించటంతో సాయం అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్వయంగా హెడ్ కానిస్టేబుల్ సతీమణి హేమలతతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీసు శాఖలో అంకిత భావంతో విధులు నిర్వర్తించే సిబ్బందిని కోల్పోవడం బాధాకరమన్నారు. అటువంటి వారి కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా చూస్తామని తెలిపారు. జిల్లా ఎస్పీతో పాటు డీపీఓ బి.సెక్షన్ సూపరిండెంట్ కె.రాధ పాల్గొన్నారు.

అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారికి సాయం



చిన్నారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న పాఠశాల యాజమాన్యం

మంగళగిరి టౌన్: అరుదైన వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారికి మంగళగిరి పట్టణంలో ఉన్న ఓ పాఠశాల చేయూతనందించింది. మంగళగిరి పరిధిలోని సెయింట్ ఫ్రాన్సిస్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో చిన్నారి తల్లిదండ్రులకు శనివారం రూ.4 లక్షల విలువైన చెక్కును యాజమాన్యం అందజేసింది. పాఠశాల డైరెక్టర్ కేవీ ఫ్రాన్సిస్ మాట్లాడుతూ పల్నాడు జిల్లా నరసరావుపేట, పసనతోటకు చెందిన షేక్ యాసిన్, షేక్ సిరిల్ దంపతులకు 18 నెలల సుహమ్మద్ జ్వాయన్ అనే కుమారుడు ఎస్ఎంఎ (స్పైనల్ మసిలేటర్ ఆట్రోఫీ) అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. ఇది 10వేల మందిలో ఒక్కరికి వచ్చే వ్యాధి అని పేర్కొన్నారు. దీనికి అవసరమైన ఇంజక్షన్‌ను అమెరికా నుంచి తెప్పించాలని, ఖరీదు సుమారు రూ.16 కోట్లు ఉంటుందని వైద్యులు తెలియజేశారు. చిన్నారి తల్లిదండ్రులు మానవతా దృక్పథంతో ఎవరైనా ముందుకు వచ్చి సాయం అందించాలని కోరారని తెలియజేశారు. ఈ మేరకు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు మూడున్నర లక్షలు సేకరించగా, మిగిలిన రూ. 50 వేలు స్కూల్ యాజమాన్యం అందించిందని, మొత్తం కలిపి రూ. 4 లక్షలను బాలుడి తల్లిదండ్రులకు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ షబానా ఫ్రాన్సిస్, వైస్ ప్రిన్సిపాల్ రజియా సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

9 మంది జూదరుల అరెస్ట్

కొల్లిపర: మండల పరిధిలోని తూములూరు శివారు క్రిస్టియన్ పాలెంలో శనివారం రాత్రి పేకాటాడుతున్న 9 మందిని అదుపులో తీసుకుని వారి వద్ద నుంచి 11620 రూపాయలు ఆటో ఆరు సెల్‌ఫోన్లు సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.కోటేశ్వరరావు తెలిపారు.